క్లుప్తంగా

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక

ఏన్కూరు: స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకై శుక్రవారం మండలంలోని తిమ్మరావుపేట ఉన్నత పాఠశాలలో ఎంపికలు నిర్వహించారు. ఏన్కూర్ ఎంఈఓ రహీంబీ నేతృత్వంలో వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు బ్యాటరీ టెస్టు నిర్వహించారు. ఈ టెస్ట్‌లో 20మంది విద్యార్థులు పాల్గొనగా.. 5గురు ఎంపికైనట్లు ఎంఈఓ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హకీమ్ పేట, ఆదిలాబాద్, కరీంనగర్ లలో గల స్పోర్ట్స్ స్కూలలో చేర్పించుకోవడం జరుగుతుందన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నాయకులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్యవైశ్యులు

కల్లూరు: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఖమ్మం జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌ను శుక్రవారం ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యాకా పరమేశ్వరి దేవాలయం అధ్యక్షులు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, చిన్ని కృష్ణారావు, సోమా నరేష్, తల్లాడ ఏఎంసీ ఉపాధ్యక్షులు రమేష్, మన్నెం కృష్ణ, కైలాసపు వేణుగోపాల్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు నగేష్, కల్లూరు ఆర్యవైశ్య మండల అధ్యక్షులు కిరణ్ తదితరులు ఉన్నారు.

నియామకం..

కారేపల్లి: చాకలి ఎస్సీ సాధన సమితి జిల్లా యూత్ అధ్యక్షుడిగా మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన కుమ్మరికుంట్ల ఉపేందర్‌ను నియమించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. బీసీ-ఏ గా ఉన్న చాకలి కులాన్ని ఎస్సీ జాబితాలోకి చేర్చాలని, చాకలి కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుబడి ఉన్నారన్నారు.

ఫుట్‌బాల్ జిల్లా జట్టులో మేడేపల్లి విద్యార్థి



విద్యార్థి ధోనిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి ధోని ఫుట్‌బాల్ టీమ్ ఉమ్మడి జిల్లా జట్టుకు గోల్‌కీపర్‌గా ఎంపికయ్యాడని పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని హెచ్‌ఎంతో పాటుగా ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెల 28నుంచి జులై1 వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ చాంపియన్ ఫుట్‌బాల్ పోటీల్లో ధోని పాల్గొంటారన్నారు. అభినందించిన వారిలో మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, మాజీ సర్పంచ్‌లు కొత్తపల్లి నాగలక్ష్మి, సామినేని రమేష్, పీడీ కృష్ణయ్య, గ్రామస్తులు ఉన్నారు.

పాఠశాలలకు ఎస్‌బీఐ వితరణ

సత్తుపల్లిటౌన్: మండలంలోని రేజర్ల హైస్కూల్‌కి సౌండ్‌సిస్టం, రేగళ్లపాడు ప్రాథమిక పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్ లను శుక్రవారం సత్తుపల్లి ఎస్‌బీఐ బ్యాంక్ ఆధ్వర్యాన వితరణగా అందించారు. అదేవిధంగా విద్యార్థులకు గైడ్స్, పుస్తకాలును ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రామలింగేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీబీ మేనేజర్ వేణు, శివ, ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైరా ఎస్సైను సత్కరించిన ఐక్యవేదిక నాయకులు

వైరా: వైరా ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన పుష్పాల రామారావును శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక, తెలంగాణ ఉద్యమకారుల సంఘం, ఎమ్మార్పీఎస్, బీసీ సంఘం వారి సంయుక్త ఆధ్వర్యంలో వైరాలో ఘనంగా సత్కరించారు. ఆయన చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమానలను కొనియాడారు. ఈ సందర్భంగా సబ్బండ వర్గాల నిరుపేదలకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలని ఎస్సైని కోరారు. కార్యక్రమంలో రామారావు, శ్రీనివాసరావు, బాబు, హుస్సేన్, నాగేశ్వరరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

సత్తుపల్లిటౌన్: నిజామాబాద్‌లో శనివారం నుంచి జరగనున్న ట్రేడ్ యూనియన్ సెంటరాఫ్ ఇండియా రాష్ట్ర ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా కోశాధికారి ఎ.శరత్ పిలుపునిచ్చారు. స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో జీవిస్తున్న శ్రమ వర్గానికి తక్షణమే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

సాగు.. సాగేదెలా..?



చిట్టడవిని తలపిస్తున్న బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువ



వేంసూరులో పిచ్చి మొక్కలతో నిండిన లింక్ కెనాల్

వేంసూరు మండలానికి సాగునీరు చేరి రైతుల పంట పొలాల్లో సిరులు పండించి, ఆయకట్టు రైతులకు కాసులు కురిపిస్తున్న బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువ అధ్వానంగా తయారైంది. ఇప్పటికీ కూడా ఆ కాలువను పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. దశాబ్దకాలంగా మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలువ ఆనవాళ్లు కూడా కానరాని పరిస్థితి నెలకొంది.

అధ్వానంగా బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువ

- నిండా పూడిక.. పిచ్చి మొక్కలు
- లింక్ కాలువ పరిస్థితి ఇంతే
- దశాబ్దకాలంగా మరమ్మతులు కరువు
- చెరువులకు నీరు చేరుతుందో లేదోనని రైతుల ఆందోళన

వేంసూరు: బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువ పూర్తిగా పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్కలతో నిండిపోయి అధ్వానంగా మారింది. ఈ కాలువ ద్వారా వేంసూరు మండలంలోని 56 చెరువుల కింద ఉన్న దాదాపు దాదాపు 15వేల ఎకరాల ఆయకట్టుకు నీరు చేరేది. ప్రస్తుతం కాలువ దుస్థితి చూసిన రైతులు ఈసారైనా చెరువులకు సాగునీరు చేరుతుందో లేదోనని దిగులు చెందుతున్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వాల హయాంలో..

1998లో కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎన్టీఆర్ కెనాల్.. సింగరేణి బొగ్గు గనుల విస్తరణలోకి వెళ్లగా, ఇంజనీర్లు వేశ్యకాంతల చెరువు, సిద్ధారం మీదుగా వేంసూరు మండలానికి సాగునీరు చేరేలా బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువను డిజైన్ చేశారు. దీనిని అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. తరువాత పలు కారణాలతో పనుల ఆలస్యం కాగా.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మిగిలిన పనులుపూర్తి చేసి మండలానికి సాగునీరు అందిస్తున్నారు.

మరమ్మతులకు నోచుకోని కాలువ..

బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా అధికారులు పూడికతీత పనులు చేపట్టిన పాపాన పోలేదు. దీంతో లింగపాలెం నుంచి వెంకటాపురం వరకు కాలువ నిండ జమ్మి, తుమ్మ చెట్లతో పాటు వివిధ రకాలు పిచ్చి మొక్కలతో నిండాయి. దీంతో పలువురు రైతులు ఉపాధిహామీ పనుల్లో భాగంగా చెట్లు, పిచ్చిమొక్కలను తొలగించాలని అధికారుల కోరినా.. పట్టించుకున్న నాథుడే లేడు. దీంతో అమ్మపాలెం పెద్ద చెరువుకు సాగునీరు అందించే లింక్ కెనాల్ పూడికతో నిండిపోవడంతో గతేడాది రైతులే సొంతగా పూడికతీత పనులు చేసుకున్నారు. అదే విధంగా కల్లూరుగూడెం లింక్ కెనాల్ పనులు పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పనులు చేపట్టాలి..



మండలంలోని 56 చెరువులకు సాగునీరు అందిస్తున్న బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువ.. దశాబ్ద కాలానికి పైగా పిచ్చిమొక్కలు, చెట్లను నిండి అడవిని తలపిస్తుంది. ఇకనైనా అధికారులు కాలువలో ఉన్న జమ్మి, తుమ్మ చెట్లు, పూడికతీత పనులు చేపట్టి చెరువులకు నీరు సక్రమంగా చేరేలా చర్యలు తీసుకోవాలి.

– భాస్కర్ల వీరంరాజు, మర్లపాడు

తూము ఏర్పాటు చేయాలి..



వేంసూరు పచ్చగన్నేరు కుంటకు బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువ నుంచి తవ్విన లింక్ కెనాల్ మేరక అవ్వడంతో చెరువులోకి నీరు చేరడంలేదు. కాలువకు తూము ఏర్పాటు చేస్తే నేరుగా చెరువులోకి నీరు చేరుతుంది. ఆయకట్టు రైతులకు మేలు జరుగుతుంది.

– బొంతు భాస్కర్ రావు, వేంసూరు

లింక్ కెనాల్ పూర్తి చేయాలి..



కల్లూరుగూడెంలో రెండు చెరువుల కింద ఉన్న 600 ఎకరాల రైతులకు సాగు నీటి ఇబ్బందులు కలుగకుండా బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువ నుంచి లింక్ కెనాల్ నిర్మాణం పూర్తి చేసి సాగు నీరు అదించాలి. బేతుపల్లి జలాల కోసం దశాబ్దకాలంగా ఎదురు చూస్తున్నాం.

– బండి శ్రీనివాసరెడ్డి, కల్లూరుగూడెం

కష్టపడే ప్రతీ ఒక్కరికి గుర్తింపు



సత్యనారాయణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాందాస్, నాయకులు

వైరా: కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కష్టపడిన ప్రతీ నాయకుడు, కార్యకర్తకు గుర్తింపుగా తగిన పదవులు లభిస్తాయని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. శుక్రవారం వైరాలోని ఇటీవల పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన వైరా వాసి నూతి సత్యనారాయణ గౌడ్‌ను సన్మానసభ నిర్వహించారు. అంతకు ముందు కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి అయ్యప్ప ఆలయంలో పూజలు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే రాందాస్, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యం, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, నాయకులు రాజశేఖర్, జైపాల్, సీతారాములు, శ్రీనివాసరావు, పుల్లయ్య, నర్సింహారావు, ఆదినారాయణ, కృష్ణ, వెంకటకృష్ణ, శబరినాథ్, జనార్దన్, కనకదుర్గ, రాజశేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కల్లూరురూరల్: మండలంలోని మర్లపాడు క్రాస్ రోడ్‌లో గత కొన్ని రోజులుగా మిషన్ భగీరథ పైపు ఓహెచ్ బీఆర్ వాల్ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా పోతుంది. దీంతో ఈ నెల 18న 'సాక్షి'లో 'వృథాగా పోతున్న తాగునీరు' అనే శీర్షికన ప్రచురించటం జరిగింది. ఈ కథనానికి మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. దీంతో పలు గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీరు అందుతోంది.

ఇంటి పనుల్లో వేగం పెంచాలి

కారేపల్లి: ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సింగరేణి ఎంపీడీఓ సురేందర్ అన్నారు. శుక్రవారం కారేపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగా ఇళ్లు నిర్మించాలని, ప్రభుత్వ అధికారులు సూచన మేరకు ఇసుక కూపన్లు పొందాలన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే ముందే.. ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. సంబంధిత ఉపాధిహామీ ఫీల్డు అసిస్టెంట్లు, ఐకేపీ సీసీలు, గ్రామ కార్యదర్శులు దగ్గర ఉండి పనులను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఎం కోటేశ్వరరావు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏన్కూరు: టీబీ ప్రాణాంతక వ్యాధి దాని పట్ల అప్రమత్తంగా ఉంటూ దానిని పారద్రోలడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏన్కూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాములు తెలిపారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో టీబీ వ్యాధి లక్షణాలున్న 77 మంది వద్ద శాంపిల్స్ సేకరించి.. టీబీ వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి పద్మ, పంచాయతీ కార్యదర్శి పుష్పరాణి, టీబీ చికిత్స సూపర్‌వైజర్ సురేష్, ఆర్ సంజీవ్‌కుమార్, నర్సింగ్ ఆఫీసర్లు సాయికుమార్, దుర్గా ప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లి: గౌరిగూడెం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని సత్తుపల్లి విద్యుత్ శాఖ ఏఈ శరత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గౌరిగూడెం, రేజర్ల, సిద్ధారం, రాజీవ్‌నగర్‌లలో విద్యుత్ నిలివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహరించాలన్నారు.

తల్లాడ: తల్లాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తల్లాడ విద్యుత్ ఏఈ రాయల ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్నందు. నేడు ఉదయం 8:30 గంటల నుంచి 10:30గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఏఈ జి.అనూష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రేమిడిచర్ల, ఎర్రుపాలెం, పెద్దగోపవరం, మీనవోలు, కంద్రిక గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

మందపాటి ముత్తారెడ్డికి మంత్రి పరామర్శ



ముత్తారెడ్డి కుటుంబీకులను ఓదారుస్తున్న మంత్రి

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం గౌరిగూడెం మాజీ సర్పంచ్ మందపాటి ముత్తారెడ్డి కుటుంబాన్ని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ముత్తారెడ్డి మనవడమైన బండి మార్కవ్ వెంకటేశ్వరరెడ్డి ఇటీవల మృతి చెందగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్‌తో పాటు సుజలరాణి, మౌలాలీ, ఎం.డీ.కమల్‌పాషా, వనమారెడ్డి నాగిరెడ్డి, మలిరెడ్డి మురళీరెడ్డి, కృష్ణారెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, చెన్నారావు, ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలు ఎన్నిక

బోనకల్: మండలంలోని లక్ష్మీపురం గోవిందాపురం (ఎల్) గ్రామాల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను శుక్రవారం ఎంఎస్‌పీ మండల కార్యదర్శి మత్రి కరణం మాదిగ అధ్యక్షతన ఎన్నిక చేశారు. గోవిందాపురం(ఎల్) గ్రామ శాఖ అధ్యక్షుడిగా జిట్టం మల్లేష్ మాదిగ, లక్ష్మీపురానికి యంగల నాగరాజు మాదిగ లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకా నాగరాజు మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట హనుమంతరావులు మాట్లాడుతూ.. వచ్చే నెల 31న జరగనున్న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు.

పోరాట ఫలితమే వేతన బిల్లులు

బోనకల్: టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయడం కారణంగానే ప్రభుత్వం అక్టోబర్ 10 నుంచి వేతనాల బిల్లులకు అనుమతి లభించిందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వీస్ లెక్కించి వేతనం ఇచ్చేందుకు అంగీకరించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు చిన్నరంగారావు, నరేంద్ర సింహ, గంగా భవాని, ప్రసాద్, పావని, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న కేశవరెడ్డి

సత్తుపల్లిరూరల్: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేశవరెడ్డి అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ.. ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈనెల 23న జరగనున్న నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రామిశెట్టి సుబ్బారావు, కమలకుమారి, అద్దంకి వెంకటరత్నం, సాంబశివరెడ్డి, ప్రకాశరావు, బాబు, దాసు, బి.మధుసూదన్ రాజు పాల్గొన్నారు.

'ఆయిల్ పామ్'తో అధిక లాభాలు



రైతులు వేస్తున్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వైరారూరల్: వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తే రైతులు ఎక్కువ లాభాలు పొందవచ్చని ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ , ఏఓ మయాన్ మంజుఖాన్ తెలిపారు. మండలంలోని గరికపాడు గ్రామంలో రైతులు 20 ఎకరాల్లో నూతనంగా వేస్తున్న ఆయిల్ పామ్ పంటలను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ మొక్కలకు 90 శాతం సబ్సిడీ, డ్రిప్ సబ్సిడీ అందిస్తుందన్నారు. ఏఈఓ సపావత్ సైదులు, రైతులు పాలకుర్తి మోహిని, బ్రహ్మిణి, రమ్యకృష్ణ, సంకవల్లి రామారావు, గొట్టిముక్కల వెంకటపతిరాజు, బొగ్గుల శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ మురళీమోహన్‌రావు

ఎర్రుపాలెం: మండలంలోని ఇనగాలి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఒకటో తరగతిలో చేరిన పలువురి విద్యార్థులకు ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎం.శ్యామ్‌బాబు, పాఠశాల హెచ్‌ఎం శెట్టిపల్లి సంగిరెడ్డి సామూహిక అక్షరాభ్యాసం చేశారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, టై, బెల్టులు పంపిణీ చేశారు. దాత కర్నాటి సాంబశివారెడ్డి వితరణ చేసిన రూ.3వేల విలువైన నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి మదన్‌మోహన్‌రెడ్డి, గురుకుల పాఠశాలల పేరెంట్స్ కమిటీ జిల్లా కార్యదర్శి పొట్టపింజర చిట్టిబాబు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మీర్జాబేగం, ఉపాధ్యాయులు నిహాల్, నర్సింహారావు, మేరి మంజు తదితరులున్నారు.

25 వరకు దోస్త్ అడ్మిషన్ల గడువు



ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25 వరకు దోస్త్ అడ్మిషన్ల గడువు ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవీంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే దోస్త్ ప్రక్రియ రెండు దశలు పూర్తయ్యాయని, మూడో దశ చివరి తేదీ గడువు పెంచినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు దోస్త్ రిజిస్ట్రేషన్ చేసుకొని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళా గురుకులం బీబీఎం డిగ్రీ కోర్సు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలోని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది నూతనంగా బీబీఏ(బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) గ్రూపును కొత్తగా చేర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రజిత శుక్రవారం ఓక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు ఇంటర్ చదివిన వారందరూ అర్హులన్నారు. అదేవిధంగా బీకామ్(కంప్యూటర్స్), బీకామ్ జనరల్, బీఎస్సీ (ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌డీఎస్), బీఎస్సీ లైఫ్ సైన్స్ గ్రూపుల్లో చేరే గిరిజన బాలికలు ఈ నెల 25లోగా దోస్త్ రిజిస్ట్రేషన్ చేసుకుని కళాశాలలో దరకాస్తు చేసుకోవాలన్నారు.

మిర్చి మార్కెట్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రమేష్

తల్లాడ: మిర్చి అధికంగా పండించే ఈ ప్రాంతంలో మిర్చి మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదినేని రమేష్ అన్నారు. శుక్రవారం తల్లాడలో నల్లమోతు మోహన్ రావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత రైతులు తమ పంటకు మంచి ధర వచ్చేవరకు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుని, మంచి రేటు రాగానే అమ్ముకుందామనుకుంటారు. కానీ ఇక్కడ మిర్చి యార్డ్ లేకపోవడంతో వైరా వెళ్లాల్సి వస్తుంది. దీంతో రవాణా కర్చులు, కూలీలు అంటూ రైతులపై భారం పడుతోంది. కావున తల్లాడలో పత్తి మార్కెట్ తరహాలోనే సబ్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, కల్యాణపు కృష్ణయ్య, శీలం ఫకీరమ్మ, చల్లా నాగేశ్వరరావు, మన్నేపల్లి రామారావు, సత్తెనపల్లి నరేష్, షేక్ మస్తాన్, సైదులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

సత్తుపల్లి: పట్టణంలోని విశ్వశాంతి విద్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా ఆసనాలు, నమస్కారాలపై యోగా అని గురువు రాజారత్నాచారి, డాక్టర్ బత్రా భవాని విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. శరీరం, మనస్సు, ఆత్మ మూడింటిని సమతూల్యంగా ఉంచే జీవన విధానమే అనంతరం వీరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.నాగేశ్వరరావు, డైరెక్టర్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి సబ్‌జైల్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని యోగా మాస్టర్ పెనుగొండ రమేష్ వివిద్యార్థులకు యోగా ఆసనాలు నేర్పించి.. ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ కుటుంబరాజు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

తల్లాడ: స్థానిక బాలభారతి విద్యాలయంలో కేఎస్‌ఎం విద్యా సంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, పులబాల వెంకటేశ్వర్లు యోగాసనాల గురించి వివరించారు. కార్యక్రమంలో కేఎస్‌ఎం విద్యాసంస్థల డైరెక్టర్ కోటగిరి శ్రావణి, కేఎస్‌ఎం కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

చింతకాని: మండలంలోని గాంధీనగర్‌కాలనీ వద్ద శుక్రవారం ఆటోను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అనంతసాగర్ గ్రామానికి చెందిన మాలోజి సతీష్ తన ఆటోలో ఖమ్మం నుంచి స్వగ్రామానికి వస్తుండగా గాంధీనగర్ కాలనీ వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జవడమే కాక సతీష్ తీవ్రంగా గాయపడడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బస్సు ఢీకొని..

వైరా: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన వైరా బస్టాండ్‌లో శుక్రవారం జరిగింది. వైరా బస్టాండ్‌లోని కార్గో పార్సిల్‌లో పనిచేస్తున్న వెంకటేష్ బస్సులో వచ్చిన పార్సిళ్లు దించుతుండగా, భద్రాచలం డిపో నుంచి ఎదురుగా వస్తున్న బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో వెంకటేష్‌కు కాలు విరగగా 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

ఫీజుల దోపిడీ అరికట్టాలి



వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కారేపల్లి: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం కారేపల్లి మండల విద్యావనరుల కేంద్రంలో సిబ్బందికి వినతిపత్రం అందించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించకుండా, విద్యారంగ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్నాడన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ దందాను నివారించకపోతే.. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కార్తిక్, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన

చింతకాని: మండలంలోని రాఘవాపురం గ్రామంలో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి గ్రామ మాజీ సర్పంచ్ కొండపర్తి గోవిందరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.20 లక్షల వ్యయంతో భవనాన్ని నిర్మించనున్నట్లు ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి సురేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెనుబల్లి: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సీహెచ్ కిరణ్‌కుమార్ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెనుబల్లి బీసీ కాలనీలో వైద్యాధికారి ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని, చెత్తా చెదారాన్ని ఇంటికి దూరంగా వేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ శ్రీనివాస్, బి.నాగేశ్వరరావు, అలేఖ్య, సెక్రటరీ ముస్తా, ఏఎస్‌ఎం బేగం, కృష్ణకుమారి, రాణి తదితరులు పాల్గొన్నారు.